

తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1610.28	1,587.62
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,527	586
నీటి నిల్వ (టీఎంసీలు)	38.13	9.16

రక్తదానం వ్యాపారం కాదు

● సేవాభావంతో దాతలు ముందుకు రావాలి: డాక్టర్ మహిపాల్



జ్యోతి వెలిగిస్తున్న వైద్యుడు మహిపాల్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రక్తదానాన్ని వ్యాపారంలో భాగంగా పరిగణించరాదని, రక్తాన్ని కర్మాగారంలోనూ ఉత్పత్తి చేయలేము, ఇది స్వచ్ఛమైన ఆనవతా సేవకు చిహ్నం అని బళ్లారిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ మహిపాల్ అన్నారు. బసవరాజేశ్వరి 17వ వర్ధంతి భాగంగా శుక్రవారం బళ్లారి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్(బీఐటీఎం) కళాశాలలో ఉచిత స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన మహిపాల్ మాట్లాడుతూ.. 138సార్లు రక్తదానం చేసి డాక్టర్ నాగరాజ్ త్యాగం సేవలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కిష్కింద విశ్వవిద్యాలయ ఛాన్సలర్ నాగభూషణ్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా మీరు అవసరంలో ఉన్నవారికి జీవనదాతగా మారతారు. వారి చీకటి మడియల్లో మీరు వెలుగు దీపంగా ఉంటారన్నారు. విమ్స్ బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్ మెడికల్ ఆఫీసర్ బిందురాణి మాట్లాడుతూ మనం రక్తదానం చేసినప్పటి సారీ నలుగురి ప్రాణాలను కాపాడినవారమవుతామన్నారు. రక్తదానానికి యువత ముందుకు రావాలన్నారు. రిటైర్డ్ రేడియోలజిస్ట్ డాక్టర్ నాగరాజ్ రక్తదానం ప్రాముఖ్యతను వివరించారు. ఈశిబిరంలో 210 మందికి పైగా విద్యార్థులు బోధన బోధనేతర సిబ్బంది ఉత్సాహంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో డా. భరత్, డా.ఈరన్న, రామచంద్ర ప్రిన్సిపాల్, అమరేశయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కొట్టూరేశ్వర స్వామి రథోత్సవం



స్వామి రథం

కంప్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా హగరి బొమ్మనహళ్లి తాలూకా, కొట్టూరు కొట్టూరేశ్వర స్వామి రథోత్సవం శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు జరుగుతున్నట్లు ఆలయ కమిటీ అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



హొన్నప్ప(ఫైల్)

రాయచూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని చంద్రబండా సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పదవ తరగతి విద్యార్థి మృత్యువాతపడ్డాడు. గణమూరు గ్రామానికి చెందిన విద్యార్థి హొన్నప్ప(16) తన గ్రామం నుంచి చంద్రబండా హైస్కూలుకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనం ఆటోను ఢీకొట్టడంతో ఆటో క్యాబిన్ పై కూర్చుని ప్రయాణిస్తున్న విద్యార్థి హొన్నప్ప కిందపడిపోగా వాహనం టైర్ తగిలి తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. తీవ్రంగా రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. విషయం తెలుసుకున్న యాపలదిన్ని పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఏపీఎంసీలో ఆగిన వేరుశనగ అమ్మకాలు

● దళారులు.. ట్రేడర్ల మధ్య వివాదం ● రోజంతా ఇబ్బంది పడిన రైతులు ● కమిషనర్ చొరవతో తిరిగి ప్రారంభం



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వేరుశనగ

బళ్లారి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌లో దళారులు, కొనుగోళ్ల దారులు(ట్రేడర్లు) మధ్య టెండర్ల విషయంలో వివాదం చోటుచేసుకుంది. శుక్రవారం జరుగాల్సిన వేరుశనగ కొనుగోళ్ల టెండర్ ఆగిపోయింది. దీంతో మార్కెట్‌కు వేరుశనగ అమ్ముకునేందుకు వచ్చిన రైతులు రోజంతా ఇబ్బంది పడ్డారు. ఎట్టకేలకు శుక్రవారం సాయంత్రం కమిషన్, అక్కడి అధికారులు జోక్యంతో సాయంత్రం వేరుశనగ కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయి. రైతులు వివిధ ప్రాంతాల నుంచి వేరుశనగ మార్కెట్‌కు తెచ్చారు. మార్కెట్‌లో వారికి అనుకూలంగా ఉండే దళారీ వ్యాపారుల వద్ద అమ్మకానికి ఉంచారు. నిల్వ చేసిన వేరుశనగను కొనుగోళ్ల దారులు శాంపిల్ చూసి టెండర్ కోట్ చేస్తారు. సాయికుమార్ ఏజెన్సీ అండ్ సన్స్ ఎం ఆనంద బాబుకు టెండర్ ఇవ్వరాదని దళారీ వర్గం సమ్మె ప్రకటించింది. అయితే కొనుగోళ్ల దారులు ఆయనకు మద్దతు పలికారు. ఆయనను అడ్డుకుంటే ఎవ్వరూ టెండర్లలో పాల్గొనేది లేదని ప్రకటించారు. దీంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. వివిధ ప్రాంతాల నుంచి మార్కెట్‌కు వేరుశనగ కాయలు అమ్ముకునుందుకు వచ్చిన రైతులు ఇబ్బంది పడ్డారు. సాయంత్రమైనా కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో కాయలను వదిలి వెళ్లలేక, భోజనం కూడా చేయకుండా రైతులు అక్కడే ఉండిపోయారు. సాయంత్రం ఏపీఎంసీ మార్కెట్ యార్డు కమిషనర్ నంజుండే స్వామి ఇరువర్గాలకు రాజీ కుదర్చడంతో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.

పది చౌకధరల దుకాణాల లైసెన్స్‌లు రద్దు

● అక్రమాలు బయట పడడంతో తక్షణ చర్యలు
● రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ కృష్ణప్ప



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ కృష్ణప్ప

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 10 రేషన్ దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ హెచ్ కృష్ణ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన జిల్లాలోని పలు ప్రాంతాల్లో రేషన్ దుకాణాలను పరిశీలించినప్పుడు అక్రమాలు బయట పడ్డాయని, ఓ గిడ్డంగి నిర్వాహకుడిని సస్పెండ్ చేశామని తెలిపారు. పలు దుకాణాల్లో పరిశుభ్రత లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సభ్యుల లింగరాజ్, రోహిణి ప్రియ, మారుతి, సుమంత్, దొడ్డలింగణ్ణనవర్ తదితరులున్నారు.

మడుగులో మునిగి కాడెద్దుల మృతి



రామక్కవాగు వద్ద మృతిచెందిన ఎద్దులు

కంప్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని ఎమ్మిగనూరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం జడేసిద్దేశ్వర రామక్క వాగులో నీటి మడుగులో రెండు ఎద్దులు మునిగి మృతిచెందాయి. ఎమ్మిగనూరు గ్రామానికి చెందిన జడెప్ప అనే రైతు తన పొలంలో పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న సమయంలో ఎద్దులకు నీటితో శుభ్రం చేద్దామని వాగులోకి రెండు ఎద్దులను బండితో సహా మళ్లించాడు. ఎద్దులను పరిశుభ్రం చేసే సమయంలో ఒక ఎద్దు ముందుకెళ్లగా అక్కడ మడుగు వుండటం రైతు గమనించలేదు. ఒక్కసారిగా ఎద్దు మడుగులో మునిగిపోయింది. మునిగిపోతున్న ఎద్దు మరో ఎద్దు కూడా లాగడంతో మడుగులోకి రెండు ఎద్దులు వెళ్లి ఊపిరాడక మృతిచెందాయి. దిక్కుతోచని పరిస్థితిలో రైతు గట్టిగా కేకలు వేశాడు. ఎలాంటి ప్రయత్నం చేసినా ఎద్దులు బతకలేదు. సుమారు 1.50 లక్షలు విలువ చేసే రైతులు మృతి చెందడంతో రైతు ఆందోళన చెందాడు. అనంతరం జేసీబీతో మృతి చెందిన ఎద్దులను బయటకు తీశారు. వెంటనే ఇలాంటి మడుగులను అధికారులు మూసేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ



అలంకరణలో హనుమంతుడు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని సిరుగుప్ప రోడ్డు శిల్పినగర్‌లో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి ధ్వజారోహణం, గంగ పూజ, మహాగణపతి పూజ, హోమాలు, కలశ ప్రతిష్ఠ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, నాయకులు గాలి లక్ష్మీ అరుణ, కాంట్రాక్టర్ భూపాల్‌రెడ్డి, ఆలయ నాయకులు ప్రవీణ్ రెడ్డి, విశేష్, శిల్పి శివకుమార్ ఆచారి,తాపీ మేస్త్రీ రఘు, మహేశ్, రాఘవేంద్ర యాదవ్, రక్షణ మంత్రి వెంకయ్య వెంకటనారాయణస్వామి, రామాంజినిమాలు, ఆటో హెహన్, ఉమాపతి, కరియప్ప తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్ రెడ్డి

యూనివర్సిటీని మూసేస్తే పోరాటం

● మాజీ ఎమ్మెల్యే పరన్న మునవల్లి

గంగావతి రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గతంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో 9 కొత్త విశ్వవిద్యాలయాలను మంజూరు చేసింది. ఇది విద్యార్థుల భవిష్యత్తును సుభిక్షతరం చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త విశ్వవిద్యాలయాలను మూసివేయడానికి ప్రయత్నిస్తోందని గంగావతి మాజీ ఎమ్మెల్యే పరన్న మునవల్లి ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంకేతిక లోపం అనే సాకుతో విశ్వవిద్యాలయాన్ని మూసేయడం తగదని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మూసివేత ప్రయత్నాలు మానుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

డీ ఖాతా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

● నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ



దరఖాస్తులు స్వీకరిస్తున్న నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ

సిరుగుప్ప, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): డీ ఖాతా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ కోరారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణం నగరసభ కార్యాలయంలో ఫారమ్ నెంబర్ 3 కోసం ఆర్ఎస్ఎస్ ల్యాండ్‌కు సంబంధించి ప్రభుత్వం డీ ఖాతా పథకాన్ని జారీ చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నగరసభ కమిషనర్ గురుప్రసాద్, ఏఈఈ గంగాధర గౌడ, అధికారులు వెంకోబ, రాజాబక్షి, అంపన్న, నగరసభ కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

భిక్షాటనను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

● అనాథ, తప్పిపోయిన పిల్లలపై అధికారుల అవగాహన



ర్యాలీగా వెళ్తున్న అధికారులు

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఎవరైనా చిన్నారులను చేరదీసి భిక్షాటనను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో మహిళా శిశు అభివృద్ధి శాఖ, జిల్లా బాలల రక్షణ విభాగం బాలల ప్రత్యేక పోలీసు విభాగం సహకారంతో పిల్లల రక్షణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాబాలల రక్షణ యూనిట్ బాలల రక్షణ అధికారి చన్నబసప్పపాటిల్ మాట్లాడుతూ కొంతమంది భిక్షాటనను వృత్తిగా స్వీకరించారు. ఈ ఉపద్రవాన్ని సమాజంనుండి నిరోధించాలన్నారు. అలాంటి చర్యలకు పాల్పడే వారిని గుర్తించి రక్షించి బాలల సంక్షేమ కమిటీ ముందు హాజరుపరిచి పునరావాసం కల్పిస్తామన్నారు. ప్రత్యేక పోలీసు విభాగం అధికారి లలితమ్మ మాట్లాడుతూ.. భిక్షాటన, ర్యాగింగ్‌లో పాల్గొన్నవిల్లలు వీధి బాలలు, వ్యభిచార వృత్తిలో పాల్గొన్న పిల్లలు అనాథ పిల్లలు, అక్రమ రవాణాకు గురైన పిల్లలు, వదిలివేయబడిన పిల్లలు, దోపిడికి , వేధింపులకు గురైన పిల్లలను గుర్తిస్తే హెల్ప్‌లైన్ 1098 లేదా పోలీసు అత్యవసర సేవ 112కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. రీగల్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరప్ప మాట్లాడుతూ తప్పిపోయిన పిల్లలు కనిపిస్తే సమాచారం అందించాలన్నారు. బస్‌స్టేషన్ ఇన్‌ఛార్జ్ రాజశేఖర్, కంట్రోలర్ పంపారెడ్డి, బళ్లారి రైల్వే స్టేషన్ శివమూర్తి, పోలీస్ కానిస్టేబుల్ శంకర్, బ్రూస్‌పేట పిఎస్ఐ ఆనార్, జిల్లాపైల్వే ప్రొటెక్షన్ రవికుమార్, హొన్నూరప్ప, ఉమేశ్, ఆనంద్, కార్తీక్, సుధ, చంద్రకళ, పొజహాన్స్ బీవన్ స్టాఫ్ సిబ్బంది విశాలాక్షి సరస్వతి, నవదుర్గి సిబ్బంది పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

● అర్హులకు అన్యాయం జరిగితే సహించం: ఏఐడీఎస్ఓ



నిరసనలో ఏఐడీఎస్ఓ సభ్యులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, ఇంజనీరింగ్, మెడికల్ విద్యార్థులకు మూడు సంవత్సరాలుగా సరైన స్కాలర్‌షిప్‌లు అందించడం లేదని, అర్హులైన విద్యార్థులందరికీ తక్షణమే స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నగరంలోని వాల్మీకి సర్కిల్లో ఏఐడీఎస్ఓ నిరసన తెలిపింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కింద అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్, ఇంజనీరింగ్, మెడికల్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఆర్థిక భారంతో చదువుకు దూరం అవుతున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా విద్యార్థులు సంబంధిత మంత్రులకు, అధికారులకు అనేకసార్లు విన్నవించినప్పటికీ విద్యార్థుల కష్టాలపై చలనం లేదన్నారు. ప్రభుత్వం క్రమంగా స్కాలర్‌షిప్‌లను తగ్గిస్తోందన్నారు. స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల హక్కు, దీనిని తొలగించడానికి ఏ ప్రభుత్వానికి హక్కు లేదన్నారు. కనీసం ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలన్నారు. మార్చి 1న ప్రభుత్వానికి వ్యతిరేకంగా బెంగళూరు చలో నిర్వహిస్తున్నామని, ఈపోరాటంలోఅందరూ పాల్గొని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఏఐడీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షురాలు ఉమ, జిల్లాకార్యాలయ కార్యదర్శి నిహారిక తదితరులు పాల్గొన్నారు.

నదిలో మునిగి యువకుడి మృతి



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సిరుగుప్ప, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు తుంగభద్ర నదిలో కొలుజారి అర్జున్ నాయక్ (16) అనే యువకుడు మృతి చెందాడు. శుక్రవారం సిరుగుప్ప తాలూకా పరిధిలో కెంచనగుడ్డ గ్రామం వద్ద తుంగభద్ర నదిలో స్నానం యువకుడు స్నానం చేస్తుండగా ఆకస్మికంగా కాలుజారి పడ్డాడు. సంఘటన చూసిన స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. యువకుడిని వెలికి తీయగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. యువకుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

వ్యక్తి అదృశ్యం.. ఫిర్యాదు



బలిజ వీరేష్ (ఫైల్)

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బళ్లారి తాలూకాలోని రూపనగుడి గ్రామానికి చెందిన బలిజ వీరేష్ (32) గత సంవత్సరం డిసెంబర్ 24 తేదీ వ్యవసాయ పనులకని వెళ్లి తిరిగిరాలేదు. శుక్రవారం తండ్రి రామాంజినేయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ కనిపిస్తే పీడీ హళ్లి పోలీస్ స్టేషన్ నెంబర్ 08392-258100, 9480803052 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

జలాశయంలో యువకుడి గల్లంతు



గాలింపు చర్యల్లో పోలీసులు

కంప్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని తారానగర్ గ్రామం నారిహళ్లలో ఒడ్డు గ్రామానికి చెందిన నాగరాజు (19) అనే యువకుడు గల్లంతయ్యాడు. నాగరాజుతో పాటు బసవ, ఉలిగప్ప ముగ్గురు తెప్పపై శుక్రవారం స్నానానికి వెళ్లారు. తెప్ప ఆయప తప్పడంతో నాగరాజు నీటిలో పడ్డాడు. వెంటనే అక్కడున్న ఉలిగప్ప, బసవ ఈ విషయం తల్లిదండ్రులు, అధికారులకు తెలపడంతో వెంటనే అగ్నిమాపక అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకుని సోదాలు ప్రారంభించారు. యువకుడి గల్లంతుతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు.

పట్టణాభివృద్ధికి కృషి చేస్తా..



ఉస్మాన్‌ను అభినందిస్తున్న స్థాయి సమితి సభ్యులు

కంప్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కంప్లి పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని స్థాయి సమితి అధ్యక్షుడు ఎం ఉస్మాన్ తెలిపారు. శుక్రవారం ఆయన పదవీబాధ్యతలు తీసుకోవడంతో ఆయన కార్యాలయంలో నాయకులు మూకయ్యస్వామి, నారాయణప్ప, రుద్రప్ప తదితరులు అభినందించి సన్మానించారు. పురసభ అధ్యక్షులు బట్టా ప్రసాద్, ఉపాధ్యక్షులు సుశీలమ్మ, వార్డు కౌన్సిలర్లు అందరి కలసికట్టుగా వుండి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

హోసూరు జోన్

ఘనంగా మాతృభాషా దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ముత్తుమణి

హోసూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాతృభాషను గౌరవించేవారే నిజమైన పౌరులని వక్తలు అభిప్రాయపడ్డారు. హోసూరు ఎంజీఆర్ కళాశాలలో మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. తమిళశాఖ అనే పాటతో ఈవెంట్ చక్కగా ప్రారంభమైంది. కళాశాల పిన్సిపాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించి కంప్యూటర్ అప్లికేషన్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని మౌలిక స్వాగతం పలికారు. కళాశాల పిన్సిపాల్ డాక్టర్ ముత్తుమణి అధ్యక్షత వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ సురేశ్ కుమార్ ప్రధాన ప్రసంగంలో ప్రతి పౌరునికి మాతృభాష ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి మనిషికి మాతృభూమి, మాతృభాష, అవసరమని, తమిళభాష మన ప్రాణం అని చెబుతూ తమిళజాతి గొప్ప చాటిచెప్పారు. విద్యార్థులకు వ్యాసరచన, కవిత, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. తమిళ అధ్యయన విభాగం ఆచార్యులు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అలాగే ఇతర విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

ఉచిత బస్సుసేవలు ప్రారంభించిన మంత్రి చక్రపాణి



జెండా ఊపి, బస్సును ప్రారంభిస్తున్న పౌరసరఫరాల శాఖామంత్రి చక్రపాణి

హోసూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): హోసూరు, డెంకణికోట శాఖల్లో 6 ప్రాంతాలకు ఉచిత బస్సు సేవలను పౌర, ఆహార సరఫరాల శాఖ మంత్రి చక్రపాణి లాంఛనంగా ప్రారంభించారు. 6 రూట్లలో బస్సు సేవల ద్వారా 25 గ్రామాలకు చెందిన వేలాదిమందికి ప్రయోజనం కానుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎమ్మెల్యే వైప్రకాశ్, బర్గూరు ఎమ్మెల్యే మదియళగన్, తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్, హోసూరు మున్సిపల్ చైర్మన్ సత్యలు జెండా ఊపి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. పేదలు, పాఠశాల విద్యార్థులు, డిమాండ్లను నెరవేర్చేందుకు తమిళనాడు ముఖ్యమంత్రి పలు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులకు సరైన సమయానికి వెళ్లేందుకు వీలుగా బస్సు సదుపాయం కల్పించినట్లు తెలిపారు. హోసూరు బ్రాంచ్ పరిధిలోని సిటీ బస్ బ్రాంచి రూట్ నంబర్ హెచ్ 44ను హోసూరు నుంచి దాసనపురం, ఉద్దనపల్లి, లక్ష్మీపురం, చిన్నలక్ష్మీపురం, గోవిందపురం, మూడు గ్రామాలకు చెందిన దాదాపు 745 మంది పాఠశాల, కళాశాల విద్యార్థులు, ప్రజలు దీని ద్వారా ప్రయోజనం పొందుతారన్నారు. అలాగే దీని వల్ల ఆద్రకానపల్లి, మరుదండపల్లి, అత్తిముగం, బేరిక్క, తిరుమలకోట, పాతకోట, కుందుకోట, కిలమంగలపల్లి, అంజలం తదితర తొమ్మిది గ్రామాల్లో సుమారు 15,051 మంది పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రయోజనం కానుందన్నారు. హోసూరు శాఖల్లో చెట్టిపల్లికి వెళ్లే బస్సును హోసూరు నుంచి కొటగిరి వరకు అలాగే కొటగిరి గ్రామానికి చెందిన సుమారు 590 మంది పాఠశాల, కళాశాల విద్యార్థులకు పెల కలుగుతుందన్నారు. డెంకణికోట నుంచి హోసూరు నుంచి అత్తిపల్లికి, మరియు పంచేశ్వరం, ముదుగానపల్లి, మత్తిగిరి, దర్గా, మూకొండపల్లి, తదితర 5 గ్రామాలకు చెందిన దాదాపు 16వేలమంది విద్యార్థులకు సౌకర్యం కాగలదన్నారు. అలాగే రైతులు తాము పండించిన ఉత్పత్తులను సరైన సమయానికి నగరానికి తీసుకొచ్చి హోల్‌సేల్, రిటైల్‌గా విక్రయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హోసూరు డిప్యూటీ మేయర్ ఆనందయ్య, మాజీ ఎంపీ సభ్యుడు మురుగన్, తమిళనాడు ప్రభుత్వ రవాణా సంస్థ జోనల్ జనరల్ మేనేజర్ సెల్వం, హోసూరు కౌన్సిలర్లు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు, డీఎంకే కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఏఐటీయూసీ నిరసన



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గోపాలకృష్ణ

హోసూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ తీరుపై ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో హోసూరులో శుక్రవారం నిరసన తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. అదేవిధంగా మూకొండపల్లి, సిప్‌కాట్‌తో పాటు పలు చోట్ల హోసూరు బస్‌స్టాండ్‌లో నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. కార్యక్రమానికి జిల్లా కౌన్సిల్ కార్యదర్శి గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శులు ఏఐటీయూసీ మాదయ్యన్, సీఐటీయూ శ్రీధర్, ఐఎన్‌టీయూసీ మునిరాజు నాయకత్వం వహించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన బడ్జెట్‌లో గ్రామీణకార్మికుల డిమాండ్లను పూర్తిగా పట్టించుకోలేదన్నారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రజలు నిరసన జరిగిందని తెలిపారు.



తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న భాషా ప్రేమికులు

మాతృభాషను రక్షించుకోవాలి

తెలుగు భాషా సంరక్షణ సమితి అధ్యక్షుడు నారాయణ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాతృభాషను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తెలుగు భాషా సంరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ నారాయణ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తెలుగు భాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఎస్ఎస్‌బీఎన్ హైస్కూల్ నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకు ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ మాతృభాష మాతృమూర్తితో సమానమన్నారు. జీవనోపాధి కోసం ఆంగ్లాన్ని నేర్చుకోవడం తప్పుకాదని, అదే సర్వస్వం అనుకోవడమే తప్పు అవుతుందన్నారు. తేనెవంటి తెలుగును రక్షించుకోవాలంటే రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలోనూ కనీసం ఐదో తరగతి వరకైనా తెలుగు మాధ్యమంలోనే బోధన జరగాలన్నారు. శిశువు మానసిక వికాసానికి మాతృభాషను మించింది ఏదీ లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌బీఎన్ హైస్కూల్ హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, నాగరాజు, ముత్యాలప్ప, వెంకటనారాయణ, నానీల నాగేంద్ర, సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, వీవీకేకే ఉపాధ్యాయుడు ఈరన్న, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

యాపారం మొదలైంది..!

ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో అడ్మిషన్లు ప్రారంభం

- విద్యా సంవత్సరం ముగియకనే సందడి
- టీచర్లు, సిబ్బందికి 'యాజమాన్యాల' టార్గెట్
- పిల్లలను చేర్చకపోతే జీతంలో కోతలు
- ఇతర స్కూళ్లకు తరలివెళ్లకుండా విద్యార్థులకు ఫీజుల వల
- చోద్యం చూస్తున్న విద్యాశాఖాధికారులు

నియోజకవర్గం	కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు	పనిచేస్తున్న సిబ్బంది
అనంతపురం అర్బన్	176	1428
గుంతకల్లు	132	913
కళ్యాణదుర్గం	36	334
రాప్తాడు	50	510
రాయదుర్గం	60	404
శింగనమల	60	456
తాడిపత్రి	117	950
ఉరవకొండ	47	328
మొత్తం	678	5,323

అనంతపురం విద్య, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): 'ఫీజు కట్టండి. బుక్స్ కొనుక్కోండి'. విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రైవేట్ స్కూళ్ల వద్ద ఈ మాటలు సర్వసాధారణం. కానీ నాలుగు నెలల ముందే వినిపిస్తున్న ఈ మాటలు తల్లిదండ్రులకు కర్ణకఠోరమనిపిస్తున్నాయి. విద్యా సంవత్సరం ముగియడానికి ఇంకా రెండు నెలల సమయం ఉంది. కానీ కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో అప్పుడే బుక్కుల వ్యాపారం మొదలెట్టేశారు. 2025-26 విద్యాఏడాదికి ఇప్పటి నుంచే ముందస్తు అడ్మిషన్ల పేరుతో వ్యాపారం మొదలెట్టారు. దీనికి కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో పనిచేసే టీచర్లు బలి అవుతున్నారు. క్లాసులు చెప్పడం అటుంచితే, అడ్మిషన్ల టార్గెట్‌తో వేధిస్తున్నారు.

జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్నారు



శ్రీచైతన్య, నారాయణ వంటి కొన్ని కార్పొరేట్ స్కూళ్లు ముందస్తు అడ్మిషన్ల కోసం టీచర్లను వేధిస్తున్నారు. కొన్ని స్కూళ్లలో అడ్మిషన్లు చేయకపోతే జీతం హోల్డ్‌లో పెడతామంటూ బెదిరిస్తున్నారు. హాలిడేస్‌లో ఫోన్లలోనూ, బయట తిరిగి అడ్మిషన్ల కోసం క్యాంపెయిన్ చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇలాంటి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

- సురేష్ యాదవ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య

సిబ్బందికి అడ్మిషన్ల వేధింపులు

జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో పనిచేసే సిబ్బందికి అప్పుడే అడ్మిషన్ల కష్టాలు మొదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 678 కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో 1,94,674 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. అధికారిక లెక్కల మేరకు 5,323 మంది టీచర్లు పని చేస్తున్నారు. అనధికారికంగా మరో 20 శాతం మంది ఉండే అవకాశం ఉంది. అయితే టీచర్లను కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్లు ఉత్పత్తి చేసే యంత్రాల్లా చూస్తున్నారు. ప్రతి టీచర్‌కు ముందస్తు అడ్మిషన్ల టార్గెట్ ఇస్తున్నారు. వచ్చే ఏడాది అడ్మిషన్లు చేయకుంటే ఉద్యోగాలు ఉండవంటూ హెచ్చరిస్తున్నారు. వారానికి హాస్టల్ అడ్మిషన్లు 2 లేదా 3, డేస్కార్ అడ్మిషన్లు సైతం 2 లేదా 3 తప్పనిసరిగా చేయాలి. ఫోన్లలో అడుక్కుంటారో.. లేక ఇల్లిల్లు తిరిగి చేస్తారో మాకు తెలియదు. మీకిచ్చిన టార్గెట్ పూర్తి చేయాల్సిందే అని వేధిస్తున్నారు. ఈక్రమంలోనే రెండో శనివారం, ఆదివారం కూడా సెలవులు ఇవ్వకుండా పాఠశాలలకు రప్పిస్తున్నారు. దీంతో కుటుంబాలను వదిలి వారం మొత్తం జీవితాలను పాఠశాలకే అంకితం చేయాల్సిన దుస్థితిని చాలా ప్రైవేట్ స్కూళ్ల సిబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇంతటితో ఆగక అడ్మిషన్ల టార్గెట్ చేయకుంటే జీతాలు నిలిపేస్తామని, కోత విధిస్తామని బెదిరిస్తున్నట్లు సమాచారం. ఇచ్చే అరకొర జీతాల్లో కూడా కోత పెడితే ఎలా బతికేదంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొందరు టీచర్లకు జీతాల్లో కోత పెట్టి, వాళ్లకు తోచినంత చేతిలో పెట్టినట్లు తెలిసింది.



ముందే.. బుక్స్, ఫీజులు

ముందస్తు అడ్మిషన్లు చేయడమే కాకుండా ఇప్పటికే స్కూళ్లలో ఉన్న పిల్లలు జారిపోకుండా ఫీజులు కట్టించుకుని, బుక్స్ అంటగట్టి ఇరికించుకుంటున్నారు. పలు కార్పొరేట్ స్కూళ్లలో డేస్కాలర్ విద్యార్థులకు రూ. 3500, హాస్టల్ విద్యార్థులకు రూ. 5,500 అడ్మిషన్ల ఫీజులుగా గుంజుకుంటున్నారు. పుస్తకాల కోసం అని రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకూ లాగేస్తున్నారు. 9 వ తరగతి పూర్తయిన విద్యార్థులకు పదో తరగతికి అడ్మిషన్‌ను ముందే కన్ఫర్మ్ చేసుకుంటున్నారు. అయితే చాలా కార్పొరేట్ స్కూళ్లలో 2025-26 అడ్మిషన్ల కోసం ఇప్పటి నుంచే పుస్తకాలు, అడ్మిషన్లు అంటూ కౌంటర్లు, దుకాణాలు తెరిచినా...జిల్లా విద్యాశాఖాధికారులు మాత్రం నిద్రమత్తులో జోగుతున్నారు.

నిద్రమత్తులో విద్యాశాఖ

2025-26 విద్యాఏడాది ప్రారంభం కాకముందే కార్పొరేట్ విద్యాసంస్థలు మాఫియాను సాగిస్తున్నాయి. ముందుగానే అడ్మిషన్లు తేవాలంటూ టీచర్లను వేధిస్తున్నారు. రూ. 5,500 నుంచి రూ. 10,500 ఇలా అడ్మిషన్ల కోసం ఇప్పటి నుంచే ఫీజులు కట్టించుకుంటున్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు మౌనంగా ఉండటం దారుణం. వీటిపై జిల్లా కలెక్టర్ స్పందించాలి.

- పరమేశ్వర్, ఎస్ఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి



తనిఖీ చేయాలని ఆదేశిస్తా

విద్యా ఏడాది ముగియక ముందే కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో అడ్మిషన్లు చేపట్టడం నిబంధనలకు విరుద్ధం. 2025-26 విద్యాఏడాది ప్రారంభం కాక ముందే ఏ పాఠశాలలో కూడా అడ్మిషన్లు చేయకూడదు. ఎక్కడ అడ్మిషన్లు చేస్తున్నా వెంటనే చర్యలు తీసుకుంటాం. డిప్యూటీ డీఈఓలు, మండల విద్యాశాఖాధికారులకు ముందస్తు అడ్మిషన్లపై తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేస్తా.

- ప్రసాద్ బాబు, డీఈఓ, అనంతపురం

కేసులు నమోదు చేయాలి



విద్యా సంవత్సరం ఇంకా రెండు నెలలు ఉండగా ఇప్పటి నుంచే రాబోయే ఏడాదికి అడ్మిషన్లు చేయాలంటూ పాఠశాల సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. ముందస్తు అడ్మిషన్లు చేయరాదంటూ ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నా, వాటిని బేఖాతరు చేస్తూ విచ్చల విడిగా సాగిస్తున్నారు. ముందస్తు అడ్మిషన్ల కోసం ఒత్తిడి చేస్తున్న యాజమాన్యాలపై కేసులు నమోదు చేయాలి.

- నరేష్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎన్ఎస్‌యూఐ

ఆందోళన చేస్తాం..



ప్రభుత్వ నిబంధనల మేర కు విద్యా ఏడాది ఆరంభమైన తర్వాత అడ్మిషన్లు చేపట్టాలి. కానీ 20 25-26 విద్యా ఏడాదికి ఇప్పటి నుంచి అక్రమం గా అడ్మిషన్లు చేయడం రూల్స్‌కు విరుద్ధం. ముందస్తు అడ్మిషన్ల కోసం టీచర్లపై ఒత్తిడి తెస్తున్నారు. టార్గెట్లు పెట్టి వేధిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న యాజమాన్యాలపై వెంటనే డీఈఓ చర్యలు తీసుకోవాలి. లేకుంటే ప్రత్యక్ష ఆందోళనలు చేస్తాం.

- పాపిరెడ్డిపల్లి పృథ్వి, ఏఐఎస్‌బీ జిల్లా ప్రధానకార్యదర్శి

సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి



విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కార్పొరేట్ స్కూళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ముందస్తు అడ్మిషన్లు కోసం సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. అధికారులను సైతం శాసించే స్థాయిలో కార్పొరేట్ శక్తులు వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వం ఫీజు రెగ్యులేటింగ్ కమిటీని తీసుకొచ్చి అడ్మిషన్లు, ఫీజుల వేధింపులపై టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి, ఫిర్యాదులు స్వీకరించాలి.

- చంద్రశేఖర్, వైఎస్ఆర్ విద్యార్థి విభాగం, జిల్లా అధ్యక్షుడు

రూ. 5 వేలు ఇప్పుడే కట్టాలట



జిల్లాలో పలు కార్పొరేట్ స్కూళ్లలో ఇప్పుడే అడ్మిషన్ల సందడి మొదలు పెట్టారు. విద్యా ఏడాది ముగియక ముందే...వచ్చే విద్యా ఏడాది అడ్మిషన్‌కు సంబంధించి రూ. 5 వేలు కట్టాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారు. జూన్‌లో చేయాల్సిన అడ్మిషన్లు ఇప్పుడే మొదలెట్టారు. ఫిబ్రవరిలోనే పుస్తకాలు కూడా కొనాలని ఒత్తిడి తెస్తున్నారు. టీచర్లకు టార్గెట్లు పెట్టి బెదిరిస్తున్నారు. విద్యాశాఖాధికారులు దీనిపై స్పందించాలి.

- కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

రైళ్లలో దొంగతనాలను కట్టడి చేయాలి: జీఆర్పీ ఐజీపీ

గుంతకల్లు, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): వేసవిలో రైళ్లలో దొంగతనాలను కట్టడి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రైల్వే పోలీసు శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఐజీపీ) కేవీ మోహన్ రావు పేర్కొన్నారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయంలోని సమావేశ భవనంలో ఏపీ, కర్ణాటక రాష్ట్రలకు చెందిన జీఆర్పీ, ఆర్పీఎఫ్, సివిల్ పోలీసు శాఖల అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏపీ రైల్వేస్ ఐజీపీ మోహన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో రైళ్లలో దొంగతనాలు జరిగే ప్రాంతాలు, దోపిడీలకు పాల్పడే గ్యాంగులు, ఆ గ్యాంగులు ప్రయాణికులను దోచుకునే విధానం, తదితర అంశాలపై చర్చించారు. ఐజీపీ మాట్లాడుతూ బంగారం ధరలు ఆకాశాన్నంటినా వినియోగం తగ్గని కారణంగా స్వర్ణకారులు రైళ్లల్లో బంగారాన్ని తెస్తూ ఉంటారని, దోపిడీ ముఠాలు వారిని టార్గెట్ చేస్తాయని తెలిపారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడానికి రైళ్లల్లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ శాఖలు సమన్వయంతో గస్తీలను నిర్వహించాలన్నారు. అన్ని శాఖల సమన్వయం సాధించి రైళ్లల్లో నేరాలను కట్టడి చేయడమే బోర్డర్ క్రైం మీటింగ్ లక్ష్యమన్నారు. సమావేశంలో గుంతకల్లు డివిజన్ జీఆర్పీ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

అనంతా.. మభ్యపెట్టే మాటలు మానుకో...

జగన్‌రెడ్డికి భద్రత తగ్గించారనడం హాస్యాస్పదం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్




మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): 'మీ ఐదేళ్ల పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేసినందుకే ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. ఆ విషయాన్ని మరచి మరోసారి ప్రజలను మభ్యపెట్టే మాటలు మాట్లాడటం ఇకనుంచైనా మానుకోవాల'ని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ హితవు పలికారు. జగన్‌రెడ్డికి భద్రత తగ్గించారని కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... మిర్చి రైతులకు మద్దతు ధర లేదని గుంటూరు మిర్చి యార్డులో నిరసన చేయాలని జగన్‌రెడ్డి వెళ్లడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల నియమావళి అమలులో ఉందన్న సంగతి ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్‌కు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అక్కడికి వెళ్లారే తప్ప... అక్కడ ఏం వెలగబెట్టారో చెప్పాలని నిలదీశారు. అధికారంలో ఉన్నపుడు మిర్చి రైతులకు రూపాయి మేలు చేశారా అని ప్రశ్నించారు. దౌర్జన్యంగా మిర్చి యార్డులోకి వెళ్లి అక్కడున్న వారిని భయభ్రాంతులకు గురిచేశారన్నారు. వైసీపీ అధినేత జగన్‌రెడ్డికి సెక్యూరిటీ తీసేశామంటున్నారనీ, ఆయన మాజీ ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే మాత్రమేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రొటోకాల్ ప్రకారం ఆయనకు సెక్యూరిటీ కల్పిస్తున్నామన్నారు. అమ్మఒడి పథకం ఇవ్వకుండా చేశారని పేటీఎం బ్యాచ్‌లు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదివే పాపతో అబద్ధాలు చెప్పిస్తే నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇలాంటి చిల్లర వేషాలు మానుకోవాలని ఆ పార్టీ నేతలను హెచ్చరించారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, లీగల్ సెల్ రాష్ట్ర నేత గాజుల ఆదెన్న, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మోద్దీన్ పాల్గొన్నారు.

జగన్ ప్రజల్లో తిరగకూడదనే భద్రత కుదింపు

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం క్రైం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజల్లో తిరగకుండా చేసేందుకే భద్రత కుదించారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆరోపించారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్రలు చేస్తున్నారన్నారు. ఇల్లీగల్ యాక్టివిటీస్‌కు భద్రత కల్పించలేమని చంద్రబాబు చెప్పడం దుర్మార్గమన్నారు. రైతులను పరామర్శించటం చంద్రబాబు దృష్టిలో ఇల్లీగల్ యాక్టివిటీయా..? అని ప్రశ్నించారు. మిర్చి రైతులను జగన్ పరామర్శిస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు రాజకీయ విలువలు లేవా అని ప్రశ్నించారు. జగన్‌తో ఫొటో దిగిన చిన్నారిపై సోషల్ మీడియాలో టీడీపీ సైకోలు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. అమ్మ ఒడి వస్తుందో... రాలేదో.. నారాయణ, చైతన్య స్కూళ్ల వద్ద అడిగినా చెబుతారన్నారు.



డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాతో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

సమస్యలు పరిష్కరించండి

డీఆర్ఎం సీఎస్ గుప్తాతో ఎంపీ అంబికా, ఎమ్మెల్యే గుమ్మనూరు

గుంతకల్లు, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): అవసరమైన మేరకు నిధులు వచ్చేలా చేస్తామని, రైలు వంతెనల సమస్యను పరిష్కరించాలంటూ డీఆర్ఎం సీఎస్ గుప్తాను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కోరారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయానికి ఎంపీ, ఎమ్మెల్యే శుక్రవారం వెళ్లారు. ఈ సందర్భంగా డీఆర్ఎంతో పలు విషయాలు చర్చించారు. పట్టణంలోని కసాపురం రోడ్డులో ఉన్న ఆర్‌యూబీని వెడల్పు చేయడం, ధర్మవరం గేటు, హనుమాన్ సర్కిల్ వద్ద ఉన్న లైన్‌పై కొత్త ఆర్‌యూబీలను నిర్మించే విషయంగా చర్చించారు. ఈ వంతెనల వ్యయాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని, సమస్యను పరిష్కరించాలని కోరారు. కొత్తగా నిర్మించనున్న బైపాస్ లైన్ కింద భూములు పోగొట్టుకుంటున్న గుంతకల్లు, కసాపురం, చిప్పగిరి గ్రామాల రైతుల సమస్యలపై చర్చించారు. ఈ విషయంగా స్థానిక ఆర్డీవో శ్రీనివాసులుతో సమావేశమై రైతులకు అన్యాయం జరక్కుండా సాగునీటి సౌకర్యమున్న భూములకు ఇచ్చే పరిహారాలను రైల్వే ఇచ్చేలా చూడాలన్నారు. కరోనా సమయంలో నిలిచిన రైళ్లను పునరుద్ధరించాలని, నరసాపూర్-ధర్మవరం రైలు గమ్యాన్ని గుంతకల్లు వరకూ పొడిగించాలని, హుబ్లీ-విజయవాడ ఎక్స్‌ప్రెస్ గుంతకల్లుకు అర్ధరాత్రి వస్తోందని, దాన్ని 3 గంటలు ఆలస్యంగా నడిపితే రాయలసీమ ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, మష్బారు తిమ్మప్ప, ముష్బారు భాస్కర్, పూల రమణ, యూ ప్రభాకర్ పాల్గొన్నారు. .

నేడు 'పాల్'పై శిక్షణ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పర్సనలైజ్డ్ అడాప్టింగ్ లర్నింగ్ (పీఏఎల్) కార్యక్రమంపై శనివారం ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 53 స్కూళ్లలో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థుల వ్యక్తిగత సామర్థ్యాన్ని గుర్తించి, వారు నేర్చుకునే విధానాన్ని మెరుగుపర్చాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగా గతంలో 32 కేజీబీవీల్లో ప్రిన్సిపాళ్లకు, గణితం, ఇంగ్లిష్, తెలుగు టీచర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. 15 మోడల్ స్కూళ్ల, ఆరు రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు శనివారం శిక్షణ ఇస్తామన్నారు. సంబంధిత ప్రిన్సిపాళ్లు, టీచర్లు విధిగా హాజరుకావాలన్నారు.

కేసుల దర్యాప్తు వేగవంతం చేయండి: ఎస్పీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ జగదీష్.. పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం అనంతపురం రూరల్ సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మట్కా, పేకాట, గంజాయి, ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలన్నారు. కేసుల దర్యాప్తు పురోగతిపై ఆరాతీశారు. సమీక్షలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేష్, సీఐలు శేఖర్, హేమంత్ కుమార్, శ్రీహర్ష, కరుణాకర్, కౌలుట్లయ్య, సత్తిబాబు పాల్గొన్నారు.

అపురూపం..!

సృష్టిలో అద్భుతం... కవలల బంధం

కష్టసుఖాల్లో ఒక్కటిగా.. ఒకరికొకరుగా..

నేడు కవలల దినోత్సవం

ఒకరు నవ్వితే..
మరొకరి మోములో
ఆనందం చిగురిస్తుంది..
ఒకరు ఏడిస్తే..
మరొకరి కళ్లు చెమరుస్తారు..
కష్టాలు.. కన్నీళ్లు..
సుఖాలు.. బాధలు..
అన్నీ పంచుకుంటారు..
అన్నింటా కలిసే ఉంటారు..
ఒక్కటిగా..
ఒకరికొకరుగా..
అదే కవలల బంధం..
సృష్టిలో అపురూప అనుబంధం..
అతి కొద్దిమందికే దక్కే భాగ్యం..

22నే ఎందుకు?

కవలల దినం ఫిబ్రవరి 22వ తేదీనే నిర్వహించడంలో ఓ ప్రత్యేకత ఉంది. ఫిబ్రవరి రెండో నెల. అందులోనూ 22వ తేదీలో రెండు రెళ్లు ఉంటాయి. కవలలు అంటే ఇద్దరు కావున, ఫిబ్రవరి 22వ తేదీన నిర్వహిస్తారు.

యాడికి, అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సృష్టిలో అద్భుతం కవలల బంధం. ఒకే రూపం కలిగిన ఇద్దరు.. ఒకే ఇంటిలో ఉంటే దానిని అద్భుతం కాక ఏమంటారు? కొంతమంది కవల పిల్లల్లో ఎవరు, ఎవరో కనుక్కోవడం కష్టమే. అది కుటుంబ సభ్యులకే సాధ్యం. ఇద్దరు ఒకే పోలికలతో ఉండడం, ఒకే తరహా డ్రస్ వేసుకోవడం, వారి పేర్లు కూడా అన్నదమ్ముల పేర్లే పెట్టడం ఇలా అంతా ఒకేలా ఉండడం... అన్నీ గొప్ప అనుభూతులే. ఫిబ్రవరి 22వ తేదీన కవలల దినం నిర్వహించుకుంటారు. కవలలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

కవలలు అంటే..

ఒకే కాన్పులో ఇద్దరు జన్మిస్తే వారిని కవలలు అంటారు. తల్లి ఒక ఆడ, ఒక మగ బిడ్డకు జన్మనివ్వవచ్చు. ఇద్దరు మగపిల్లలకు జన్మనివ్వవచ్చు. ఇద్దరు ఆడపిల్లలకు జన్మనివ్వవచ్చు. వైద్య పరిభాషలో ఒకే పోలికలతో ఉన్న కవలలను ఐడెంటికల్ ట్విన్స్ అనీ, వేర్వేరు పోలికలతో ఉన్న వారిని నాన్ ఐడెంటికల్ ట్విన్స్ అని పిలుస్తారు. కవలలను పెంచడంలో కొన్ని సమస్యలు ఎదురైనా వారి తల్లిదండ్రులు వాటిని ఆనందంగా స్వీకరిస్తుండడం గమనార్హం. కవలలుగా పుట్టిన వారిలో ఆప్యాయత, అనురాగాలు ఎక్కువగా ఉండడం గమనార్హం. ఒకరికి కష్టం వస్తే మరొకరు స్పందిస్తుంటారు.

పోలికలు సేమ్.. అలవాట్లు వేర్వేరు..

కవలలు ఒకే రూపంలో ఉన్నా.. వారి వేలిముద్రలు, కళ్లు మాత్రం వేరుగా ఉంటాయి. కొంతమంది కవలల ముఖ కవళికలు ఒకేలా ఉన్నా వారి శారీరక బరువు వేర్వేరుగా ఉంటుంది. వారి ఆకృతి ఒకేలా ఉన్నా.. ఆలోచనలు భిన్నంగా ఉంటాయి. ఇద్దరిలో రోగనిరోధక శక్తుల్లో కూడా తేడా ఉంటుంది.

అన్నింటా ముందంజ



అనంతపురంలోని కోవూర్‌నగర్‌కు చెందిన చిదానందమూర్తి, నిర్మల దంపతులకు కలిగిన కవలలు సందీప్, సంతోష్ వారి ఆలోచనలు, ప్రవర్తన ఒకేలా ఉంటాయంటున్నారు వారి తల్లిదండ్రులు. సందీప్ ఎంటెక్ పూర్తి చేసి, ప్రాజెక్ట్ అసోసియేట్‌గా పనిచేస్తున్నాడు. సంతోష్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంబీఏ చివరి సంవత్సరం చదువుతూ ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్‌గా ఉద్యోగం పొందాడు. వీరిద్దరూ చదువుతోపాటు అన్నింటా ముందంజలో ఉంటారంటున్నారు వారి తల్లిదండ్రులు.

దేవుడి వరం



అనంతపురానికి చెందిన జిలాన్‌బాషా, ఫక్రున్నీషా దంపతులకు పెళ్లైన ఎనిమిదేళ్ల వరకు సంతానం లేదు. ఆ తర్వాత కవలలు జన్మించారు. అది కూడా ఆడపిల్లలు. వారికి జిక్రా, బుష్రా అని పేర్లు పెట్టుకున్నారు. వారిరువురి అలవాట్లు ఒకేలా ఉంటాయంటున్నారు. చదువులో ఒకరికొకరు సాయం చేసుకుంటుంటారట. ఇంట్లోనూ తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ఒకరిని మించి ఒకరు ప్రేమానురాగాలు కనబరుస్తుంటారు. కవల బిడ్డలు దేవుడిచ్చిన వరం అంటూ ఆ తల్లిదండ్రులు ఆనంద పడుతుంటారు.

నిర్ణయాలు కలిసే తీసుకుంటాం

రామ్‌లక్ష్మణ్, రాయలచెరువు



మాకు ఇప్పుడు 33సంవత్సరాలు. మా ఇద్దరి ఆలోచనలు, నిర్ణయాలు ఒకే విధంగా ఉంటాయి. ఏవీఎన్ నెట్ కేఫ్, ఏవీఎన్ మినరల్స్ నిర్వహిస్తున్నాం. ఏది చేసినా కలిసే చేస్తాం. ఇద్దరం ఒకేసారి కోప్పడతాం. కొద్దిసేపటికి సర్దుకుంటాం. లోకంలో దేవుడు ఇచ్చిన అద్భుత సృష్టి కవలలు. మా మధ్య ఏనాడూ విభేదాలు తలెత్తలేదు.

దేవుడిచ్చిన వరం

పవన్, ప్రభంజన్, యాడికి



కవలలుగా బతకడం దేవుడిచ్చిన వరం. మాకు ఇప్పుడు 28 సంవత్సరాలు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా, ఫైనాన్స్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్నాం. ఏ సమస్య వచ్చినా ఇద్దరం పంచుకుంటాం. దుఃఖమైనా, సంతోషమైనా ఇద్దరం పంచుకుంటాం. బంధువుల ఇళ్లకు ఇద్దరం కలిసి వెళ్లినపుడు అందరూ చూసి ఆశ్చర్యపోతుంటారు. కొన్నిసార్లు ఎవరు ఎవరని గుర్తుపట్టలేకపోతుంటారు. మా మాట, నడవడిక ఒకేలా ఉంటాయి.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

కొండా వెంకటప్పయ్య (జయంతి)



స్వాతంత్ర్య సమరయోధుడు కొండా వెంకటప్పయ్య 1866 ఫిబ్రవరి 22న పాతగుంటూరులో జన్మించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రోద్యమానికి ఆద్యులు, దేశభక్త బిరుదాంకితుడు. 'కృష్ణా' పత్రికను స్థాపించి ప్రజలను చైతన్యపరిచారు. ఆంధ్ర మహా సభకు అధ్యక్షుడు. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీకి తొలి కార్యదర్శి. గాంధీజీ ఉపసేనానుల తొలిజట్టుకు చెందిన వారు. భాషా ప్రాతిపదకన మద్రాసు రాష్ట్ర విభజనపై శాసనసభలో ఆయన ప్రవేశపెట్టిన తీర్మానం ఏకగ్రీవమైంది. తెలుగు, ఆంగ్లం భాషలలో మంచివక్త, కవి. 1949 ఆగస్టు 15న స్వర్గస్థులయ్యారు.

పువ్వుల సూరిబాబు (జయంతి)




పువ్వుల సూరిబాబు 1915 ఫిబ్రవరి 22న కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా బొమ్మలూరు గ్రామంలో జన్మించారు. సుప్రసిద్ధ తెలుగు రంగస్థల, సినిమా నటుడిగానే కాక గాయకుడిగా నాటక ప్రయోక్తగా ప్రతిభ చాటుకున్నారు. 1944లో నటీమణి రాజరాజేశ్వరిని వివాహమాడారు. ఆమె పేరిట నాట్యమండలి స్థాపించారు. కొప్పరపు సుబ్బారావుతో 'తారా శశాంకం' నాటకాన్ని రాయించి తానే దర్శకత్వం వహించారు. 1500కుపైగా నాటకాలను ప్రదర్శించారు. భూ కైలాస్, కురుక్షేత్రం, విప్రనారాయణ, తులాభారం తదితర పౌరాణిక నాటకాలను దేశమంతా ప్రదర్శించి కీర్తిప్రతిష్ఠలు పొందారు. 1946లో మైసూరు మహారాజ దర్బారులో సత్కారం పొందారు. గజారోహణం, గండపెండేరం తదితర సన్మానాలు అందుకున్నారు. 1968 ఫిబ్రవరి 12న కన్నుమూశారు.

కలువకొలను సదానంద (జయంతి)



ప్రముఖ బాలసాహిత్య రచయిత కలువకొలను సదానంద 1939 ఫిబ్రవరి 22న చిత్తూరు జిల్లా పాకాలలో జన్మించారు. కేంద్ర సాహిత్య అకాడమీచే బాల సాహిత్య పురస్కారం అందుకున్న తొలి వ్యక్తి. వృత్తిరీత్యా 36ఏళ్ల ఉపాధ్యాయుడిగా పనిచేసి 1997లో పదవీ విరమణ పొందారు. 200కుపైగా కథలు, 2 నవలలు, వందకుపైగా గేయాలు, గేయ కథలు రాశారు. అంతేకాక 8 కథా సంపుటాలు, రెండు నవలలు ప్రచురించారు. 1976 ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. 2020 ఆగస్టు 25న కన్నుమూశారు.

కస్తూర్బా గాంధీ (వర్ధంతి)



కస్తూరిబాయి (కస్తూర్బా) గాంధీ 1869 ఏప్రిల్ 11న గుజరాత్ రాష్ట్రం పోర్‌బందరు ప్రాంతంలో జన్మించారు. భర్త మోహన్‌దాస్ కరంచంద్‌గాంధీ (మహాత్మా గాంధీ)తో కలసి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. దక్షిణాఫ్రికా ప్రవాస భారతీయుల పోరాటంలోనూ పాల్గొని నిర్బంధాలను ఎదుర్కొన్నారు. కులమతబేధం లేకుండా స్వాతంత్ర్య సమరంలో పురుషులకు తీసిపోని విధంగా స్త్రీలు గడపదాటాలి అని కస్తూర్బా పిలుపునిచ్చారు. పోరాటాల కోసం పలుమార్లు అరెస్టు అయ్యారు. స్వాతంత్ర్యం రాకమునుపే 1944 ఫిబ్రవరి 22న కన్నుమూశారు.

బస్సు బోల్తా.. 20మందికి గాయాలు

▸▸ గుత్తి ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు



ప్రమాద స్థలంలో బాధితులు, స్థానికులు

గుత్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా జొన్నగిరి శివారులో ప్రైవేట్ బస్సు బోల్తా పడటంతో గాయపడిన 20మందిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వారికి చికిత్స అందించారు. జిల్లాకు చెందిన ఓ ప్రైవేట్ బస్సును అద్దెకు తీసుకుని ఈనెల 6న హిందూపురం నుంచి 44 మంది ప్రయాణీకులు వివిధ పుణ్యక్షేత్రాల దర్శనం కోసం బయల్దేరారు. కుంభమేళ, మంత్రాలయం తదితర ప్రాంతాలను సందర్శించి తిరిగి హిందూపురం బయల్దేరారు. జొన్నగిరి సమీపంలోకి రాగానే బస్సు ముందు టైర్ పేలింది. దీంతో బస్సు అదుపుతప్పి పంటపొలాల్లో బోల్తా పడింది. బస్సులో ప్రయాణిస్తున్న 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం విద్యుత్ నగర్‌కు చెందిన బస్సు డ్రైవర్ వినోద్‌కుమార్, అనంతపురం బ్రాహ్మణపల్లికి చెందిన తులసీ, కర్ణాటక రాష్ట్రం బసవనహళ్లికి చెందిన లక్ష్మయ్య, అనంతపురానికి చెందిన వన్నూర్‌స్వామి, కర్ణాటక రాష్ట్రం బెంగళూరు రూరల్ తాలూకా గుండంగేరికి చెందిన నాగరాజా చారి, నాగలక్ష్మి, చంద్రశేఖర్, జయలక్ష్మి, ప్రేమమ్మ, కర్ణాటక రాష్ట్రం బలసముద్రానికి చెందిన ఆదెమ్మ, హనుమంతప్ప, దొడ్డబళ్లాపూర్‌కు చెందిన ఆదిశేషు, తుమకూరుకు చెందిన పుష్పావతి, అనంతపురానికి చెందిన ప్రమిళ, వన్నూర్‌స్వామి, మహాలక్ష్మి, ఉమాదేవి గాయపడ్డారు. క్షతగాత్రులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో తులసీ, పూర్ణాబాయి, ఆదిశేషు, లక్ష్మన్న పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఈ సంఘటనపై జొన్నగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లాన్ ఎక్సెస్ ప్రత్యేక కేంద్రం

బెంగళూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జర్మనీ దేశానికి చెందిన రసాయనాల సంస్థ లాన్‌ఎక్సెస్ ఇండియాలో వినియోగదారులు, వ్యాపారుల మార్కెటింగ్ నిపుణుల కోసం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు ప్రకటించారు. సంస్థ చైర్మన్ మతియాస్ జుకట్ పేరిట్ శుక్రవారం నగరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో 20ఏళ్లుగా లాన్‌ఎక్సెస్ సేవలు అందిస్తోందన్నారు. దేశీయ అవసరాలకోసం అప్లికేషన్ డెవలెప్‌మెంట్ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. మార్కెటింగ్, పరిశోధనలో ఆవిష్కరణలకు అనుకూలంగా ఉండాలని కేంద్రాన్ని తెరిచినట్టు తెలిపారు.

సాంకేతికతతోనే ఉపాధి అవకాశాలు

● సత్య గ్రూప్ డైరెక్టర్ మహేశ్‌కుమార్ ఖైతాన్



అక్రెక్స్ ప్రదర్శన ప్రారంభం ఇలా...

బెంగళూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సాంకేతికతతోనే ఉపాధి, ఆర్థికత పెంపు సాధ్యమని సత్య గ్రూప్ డైరెక్టర్ మహేశ్‌కుమార్ ఖైతాన్ అభిప్రాయపడ్డారు. బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో అక్రెక్స్ ఇండియా 2025 ప్రదర్శనను గురువారం లాంచనంగా ప్రారంభించారు. ఐఎస్‌హెచ్‌ఆర్ఇ చైర్మన్ అనుప్‌బల్లాన్, ఓల్టాస్ ఎగ్జిక్యూటివ్ ఎండీ ముకుందన్ మీనన్‌లు ముఖ్యులుగా పాల్గొనగా అక్రెక్స్ 2025 చైర్మన్ సుబ్రమణ్యం, జాన్సన్ కంట్రోల్స్ ఎండీ అరుణ్‌అవస్తి తదితరులు భాగస్వామ్యులయ్యారు. మహేష్‌కుమార్ ఖైతాన్ మాట్లాడుతూ హీటింగ్ వెంటిలేషన్, ఎయిర్ కండీషనింగ్, రెఫ్రిజరేటర్‌ల వాడకంలో దక్షిణభారత్‌లో 40శాతం సాధ్యం అవుతోందని అందులో బెంగళూరులోనే 20శాతం ఉందన్నారు. సాధారణ జీవితం నుంచి మధ్యతరగతి వర్గాలకు ప్రజలు అభివృద్ధి చెందుతున్నారన్నారు. తద్వారా నివాసాలకు అత్యంత అవసరమైన వస్తువులుగా ఉండే వాటిని సద్వినియోగం చేసుకోవడంకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఓల్టాస్ ఎండీ ముకుందన్ మెనన్ మాట్లాడుతూ దేశంలో ఏసీల వాడకం గత ఏడాదిలో 35శాతం పెరిగిందని ఈ ఏడాది 15 మిలియన్ల ఏసీలు అవసరం కానున్నాయని అభిప్రాయపడ్డారు. ఇన్‌ఫార్మా మార్కెట్ ఇండియా ఎండీ యోగేశ్ ముద్రాస్ మాట్లాడుతూ స్మార్ట్, సుస్థిరతవైపు వినియోగదారులు చూస్తున్నారన్నారు. కాగా ప్రదర్శనలకు 30వేలకుపైగా సందర్శకులు వస్తారని భావిస్తున్నామన్నారు. 40దేశాలనుంచి 500మందికిపైగా ఎగ్జిబిటర్స్ భాగస్వామ్యులు అవుతున్నట్టు ప్రకటించారు.

క్రోన్స్ ఉత్పాదనా విభాగానికి భూమిపూజ



భూమిపూజలో మంత్రి ఎంబీ పాటిల్ తదితరులు

బంగారపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల ముగిసిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్, ఇన్వెస్ట్ కర్ణాటక 2025లో మొత్తం రూ. 10.27 లక్షలకోట్లు పెట్టుబడులు సాధ్యం కానుండగా ఇందులో భాగంగా రూ.315 కోట్లతో చేపట్టే జర్మనీ దేశానికి చెందిన క్రోన్స్ సంస్థ బాట్లింగ్ యంత్రాల ఉత్పాదనా విభాగం నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ గురువారం భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పెట్టుబడుల సమావేశంలో ఒప్పందానికి ముందు మంత్రుల బృందం గత డిసెంబరులో జర్మనీ రోడ్‌షోలో కంపెనీ ప్రతినిధులతో జరిపిన చర్చలు ఫలించడంతోనే సాధ్యమైందన్నారు. పరిశ్రమలకు అవసరమైన బాట్లింగ్, శుద్ధీకరణ సాధనాలకు దేశంలో డిమాండ్ ఉందన్నారు. వీటి దృష్ట్యా క్రోన్స్ సంస్థ ఉత్పత్తి విభాగాన్ని మన రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. సంస్థ దశలవారీగా రూ.315కోట్లు పెట్టుబడులు పెట్టనుండగా 550మందికి ఉద్యోగం లభించనుందన్నారు. నిమిషానికి వందలాది బాటిల్స్ ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉందన్నారు. కాగా సంస్థలో స్థానికులు, భూమి కోల్పోయే రైతుల పిల్లలకు ఉద్యోగాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. 23 సంవత్సరాలుగా సంస్థ ఆహార, పానీయ రంగాలలో దేశంలో వ్యాపారాలు చేస్తోందన్నారు. కంపెనీ డిజిటల్ విభాగకేంద్ర కార్యాలయం బెంగళూరులో ఉందని, సంస్థ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, ఐటీ భద్రత, డిజిటల్ పరిష్కారాలకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో క్రోన్స్ పాలకవర్గం డైరెక్టర్ రేల్ఫ్ గోల్డ్ బ్రోనర్, మార్కస్ వింటర్, ప్రాజెక్టు డైరెక్టర్ క్రిమ్మర్, క్రోన్స్ ఇండియా ఎండీ హరీశ్ హనుగూడు, పరిషత్ మాజీ సభాపతి వీఆర్ సుదర్శన్, కేఐఏడీబీ సీఈఓ డాక్టర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



విద్యార్థుల నృత్య ప్రదర్శన

హోసూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): హోసూరు సమత్వపురం పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. ఎల్‌కేజీ నుంచి ఐదో తరగతి వరకు తమిళం, ఆంగ్ల భాషల్లో 290 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ ప్రభుత్వ పాఠశాలను హోసూరు మెగ్నమ్ అరిమా అసోసియేషన్ 15 ఏళ్లకుపైగా దత్తతకు తీసుకుని పలు అభివృద్ధి పనులు చేపడుతు న్నారు. తద్వారా ఈ ప్రభుత్వ పాఠశాల ప్రైవేట్ పాఠశాల మాదిరిగా అభివృద్ధి చెందింది. పలు ప్రత్యేకతలు సంతరించుకున్న ఈ ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. కార్య క్రమానికి హోసూరు జిల్లా విద్యాశాఖాధికారి సతీష్‌కుమార్ అధ్యక్షత వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి అన్నయ్య ఉపాధ్యాయులు రమేశ్ నాయకత్వం వహించారు. సమత్వపురం పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నామగిరి స్వాగతోపన్యాసం చేశారు. ముఖ్య అతిథులుగా మహేంద్రన్, రవిశంకర్, మాగ్నమ్ అరిమా సంఘ మాజీ అధ్య క్షులు, నిర్వాహకులు సమత్వపురం ప్రభుత్వ పాఠశాలకు అందించిన సేవలను గుర్తింపుగా జిల్లా విద్యాశాఖాధికారులు శాలువాలు కప్పి అభినందించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. పాఠశాల వార్షికోత్సవాలను వీక్షించేందుకు స్థానికులు పెద్దసంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

క్రికెట్ అభిమానుల సందడి



అభిమానుల సందడి ఇలా...

బెంగళూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): హ్యాట్రిక్... హ్యాట్రిక్ అంటూ క్రికెట్ అభిమానులు చిన్నస్వామి స్టేడియంలో కేరింతలు కొట్టారు. శుక్రవారం ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యుపీఎల్)లో ఆర్‌సీబీ, ముంబై ఇండియన్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. వరుసగా గుజరాత్ జాయింట్స్, ఢిల్లీ కేపిటల్స్ జట్లపై గెలుపు సాధించిన ఆర్‌సీబీ మూడో విజయం సాధించాలని అభిమానులు నినాదాలు చేశారు. అభిమానులు ప్లకార్డులు ప్రదర్శించి జట్లను ప్రోత్సహించారు. క్రికెట్ మ్యాచ్‌ను పురస్కరించుకుని మెట్రో రైలు సంచారం గడువు పెంచారు.



ఆర్‌సీబీ జెండాలతో అభిమానులు



ఓ చిన్నారి ఇలా...

రెండు ఆలయాల్లో హుండీల చోరీ



తాళాలు పగులగొట్టిన హుండీ

బాగేపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీవీజీ రోడ్డులో పక్కపక్కనే ఉన్న బైలాంజనేయస్వామి దేవస్థానం, అయ్యప్పస్వామి దేవస్థానాలలోని రెండు హుండీలను దుండగులు చోరీ చేశారు. హుండీలను పగులగొట్టి వేలాదిరూపాయలను చోరీ చేశారు. శుక్రవారం ఉదయం బైలాంజనేయస్వామి ఆలయాన్ని స్వచ్ఛపరిచేందుకు వాకిళ్లు తెరవగా హుండీల తాళం పగులగొట్టి చోరీ జరిగినట్టు గుర్తించారు. దేవదాయ శాఖ పరిధిలోని ఈ ఆలయానికి 14 నెలలుగా హుండీ ఆదాయం లెక్కించలేదు. ఏడాదికి సుమారు లక్ష రూపాయలకుపైగా ఆదాయం ఉంటుందని అంచనా. కాగా పక్కనే ఉన్న అయ్యప్పస్వామి ఆలయ హుండీని కూడా దుండగులు దోచుకెళ్లారు. గతనెల 15న హుండీ ఆదాయం లెక్కించారు. ప్రస్తుతం రూ.10-15వేల నగదు ఉండవచ్చునని అంచనా. ఘటనా స్థలాన్ని బాగేపల్లి పట్టణ సీఐ ప్రశాంత్ వర్ధి, క్రైం విభాగం అధికారి మునిరత్నం, సిబ్బంది, డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీమ్ పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. చోరీల నేపథ్యంలో ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవలికాలంలో నేరాలు పెరిగాయని రాత్రి గస్తీ పెంచాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎస్సీల అభివృద్ధికి సమాజమే కృషి చేయాలి



మంత్రి మహదేవప్పకు సన్మానం

బెంగళూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు పొందే వేతనాలలో 5శాతం సమాజానికి కేటాయిస్తే మరింత మంది అభివృద్ధి సాధ్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మహదేవప్ప అభిప్రాయ పడ్డారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీల అభివృద్ధికి సొంత సామాజికవర్గం కృషి ముఖ్యమన్నారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లా యీస్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మహదేవప్ప మాట్లాడుతూ ఇందుకోసం ప్రత్యేకనిధిని ఏర్పాటు చేసి 5శాతం వేతనాలను ఇచ్చేందుకు సిద్ధమవుదామన్నారు. సమాజంలో మార్పుకు ఇక్కడనుంచే పునాది వేద్దామన్నారు. రాష్ట్రంలో దళిత మంత్రులే లేని ప్రభుత్వాలు కొన సాగాయని, ప్రజాస్వామ్యాన్ని దుర్వినియోగం చేశారన్నారు. కార్య క్రమంలో ఎస్సీ, ఎస్టీ నోడల్ ఏజెన్సీ సలహాదారుడు డాక్టర్ ఇ వెంకటయ్య, కమిషనర్ రాజేశ్‌కుమార్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



నివేదిక విడుదలలో ఉదయ్ విజయన్ తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): దేశంలో అగ్ని ప్రమాదాలకు అవగాహన కొరతే ప్రధాన కారణమవుతుందని బియాండ్ కార్ల్‌టన్ సంస్థ అభిప్రాయపడింది. ఈమేరకు బియాండ్ కార్ల్‌టన్ గురువారం అగ్ని ప్రమాదాలపై నివేదిక విడుదల చేసింది. బెంగళూరులో కార్ల్‌టన్ టవర్‌లో అగ్నిప్రమాదం జరిగి 15ఏళ్ల పూర్తి అవుతున్న సందర్భంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు బియాండ్ కార్ల్‌టన్ నివేదిక విడుదల చేసింది. సంస్థ చైర్మన్ ఉదయ్ విజయన్ మాట్లాడుతూ దేశంలో అగ్ని ప్రమాదాలకు అవగాహన లోపమే ప్రధాన కారణమన్నారు. 1996లో 22,788 అగ్ని ప్రమాదాలు జరిగాయని 1999లో 27,976 ప్రమాదాలు జరిగాయన్నారు. 2014వరకు పదేళ్ల సరాసరిలో 23వేల ప్రమాదాలు జరిగాయన్నారు. 2022లో అగ్ని ప్రమాదాలసంఖ్య 7556కు తగ్గాయన్నారు. అగ్ని ప్రమాదాలకు ప్రధానంగా ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్, గ్యాస్ సిలిండర్ లీకేజ్, నిర్లక్ష్యం ఇతరత్రా కారణాలు ఉన్నాయన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు సరైన ప్రక్రియ సాగడం లేదని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బియాండ్ కార్ల్‌టన్ ట్రస్టీ ఆర్‌పి వెంకటాచల, తదితరులు పాల్గొన్నారు.

భూములను వదులుకోవడంపై తప్పుడు సమాచారం: రైతుసంఘం



మీడియాతో రైతుల బృందం

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని జంగమకోటె పరిధిలోని కొంతమంది ఏజెంట్లు, దళారీలు కలసి కేఐఏడీబీ కమిషనర్, భూస్వాధీనం ప్రత్యేక జిల్లా అధికారిని ఇటీవల భేటీ అయి భూమిని ఇచ్చేందుకు సిద్ధమని తప్పుడు సమాచారం ఇచ్చారని రైతుసంఘం నాయకుడు నడిపినాయకనహళ్లి అజిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాలూకాలోని జంగమకోటె హోబళి 13 గ్రామాల పరిధిలో ఫ్యాక్టరీల స్థాపనకోసం భూములను స్వాధీనం చేసుకునేందుకు కేఐఏడీబీ సిద్ధమైంది. రైతులంతా వ్యతిరేకించినా కొంతమంది దళారులు మాత్రం 90శాతం మంది భూస్వాధీనానికి అంగీకారమని అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు తాదూరు మంజునాథ్ మాట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్‌తో భేటీ అయిన వేళ రైతులతో సమావేశం నిర్వహించి మెజారిటీ రైతులు భూమి అప్పగించేందుకు అంగీకరిస్తేనే కేఐఏడీబీ ప్రక్రియ చేపడుతుందన్నారు. ఇంకా రైతుల సమావేశం, అభిప్రాయ సేకరణ జరగలేదన్నారు. అయితే కొంతమంది దళారులు మాత్రం ఇదే అదునుగా రైతులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా హీరెబల్ల కృష్ణప్ప, దేవరాజ్, శాంతకుమార్, హొంబేగౌడ, యణ్ణంగూరు అశ్వత్థనారాయణగౌడ, మంజునాథ్, దొడ్డగుమ్మణ్ణ, తదితరులు పాల్గొన్నారు.





స్వాధీనం చేసుకున్న నగదును పరిశీలిస్తున్న కమిషనర్ దయానంద్

వీసాల పేరుతో మోసాలు..!

- 51 మంది నుంచి రూ.2కోట్లకుపైగా వసూళ్లు
- దంపతులను అరెస్ట్ చేసిన పోలీసులు



కమిషనర్ దయానంద్

బెంగళూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వీసాల పేరుతో రూ.కోట్లాది రూపాయలు వసూలు చేసి మోసాలకు పాల్పడిన దంపతులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివిధ దేశాలకు వెళ్లేందుకు వీసాలు సమకూరుస్తామని నమ్మించి 51మంది నుంచి రూ.2 కోట్లకు పైగా వసూళ్లు చేసిన నిందితులను అరెస్టు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ దయానంద్ పేర్కొన్నారు. శుక్రవారం కమిషనరేట్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన జనవరి 24న ఆగ్నేయ సీఈఎన్ పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. సోషల్‌మీడియా ద్వారా వీసాలకోసం సంప్రదించాలని సక్లైన్ సుల్తాన్, నిఖాత్ సుల్తాన్ అనే దంపతులు ప్రచారం చేపట్టారు. ప్రచారానికి స్పందించిన ఓ వ్యక్తి నుంచి రూ.8 లక్షల రూపాయలు తీసుకుని వీసా ఇస్తామని అతన్ని మోసం చేశారు. బాధితుడు పలుమార్లు ఇద్దరు ఏజెంట్ల చుట్టూ తిరిగినా వారు స్పందించలేదు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గుట్టు రట్టయ్యింది. ఇలా 33మంది నుంచి 1.78 కోట్ల రూపాయలు తీసుకున్నట్లు గుర్తించారు. మరో వ్యక్తి ద్వారా 15మందికి సంబంధించిన వీసాలు చేయిస్తామని రూ.86 లక్షలు వివిధ ఖాతాలకు జమ చేయించుకున్నారన్నారు. సుదీర్ఘంగా విచారణ జరిపాక వీరి నకిలీలు బయటపడ్డాయన్నారు. మొత్తం 51మంది నుంచి 2.64 కోట్ల రూపాయలు నగదు పొందినట్లు గుర్తించామని కమిషనర్ వివరించారు. ఇద్దరినీ అరెస్టు చేసి వారినుంచి 2 కార్లు, 2 బైక్‌లతోపాటు రూ.50లక్షలతో ఓ ఇంటిని లీజుకు తీసుకున్న పత్రాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు శ్రీలంక, దుబాయ్, గోవా, ఊటీ, తదితర ప్రాంతాల్లో విలాసాలకే ఎక్కువ ఖర్చు చేసినట్లు తెలిసిందన్నారు. ఆగ్నేయ విభాగం డీసీపీ సారా ఫాతిమా బృందం అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిందన్నారు.



అరెస్టయిన దంపతులు సక్లైన్ సుల్తాన్, నిఖాత్



మాస్..!

- మాస్ కాపీయింగ్‌కు ప్రయత్నిస్తే దొరికిపోతారు..
- ఎస్ఎస్ఎల్‌సీలో వినూత్న చర్యలకు విద్యాశాఖ నిర్ణయం
- తాలూకాస్థాయిలో వెబ్‌క్యాస్టింగ్.. జిల్లాకో కంట్రోల్ రూం
- మార్చి 1నుంచి ద్వితీయ పీయూ ● 21నుంచి ఎస్ఎస్ఎల్‌సీ..



బెంగళూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ నియంత్రించేందుకు ఏటా కొత్తమార్గాలు తీసుకొస్తున్నా అవి సరైన ఫలితాలు ఇవ్వడం లేదు. ప్రత్యేకించి ఉత్తర కర్ణాటక జిల్లాల్లో మాస్ కాపీయింగ్ రాష్ట్రస్థాయిలో ఏటా చర్చనీయాంశం అవుతున్నాయి. పలు పాఠశాలల్లో కొందరు డబ్బులు వసూలు చేసి మాస్‌కాపీయింగ్‌కు పాల్పడడం విద్యాశాఖకు తలనొప్పిగా మారింది. అయితే ఈ ఏడాది ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌ను సంపూర్ణంగా నియంత్రించేందుకు రాష్ట్ర పాఠశాల పరీక్షా మౌల్యమాపన మండలి సరికొత్త విధానం తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. తాలూకాస్థాయిలో వెబ్‌క్యాస్టింగ్ అమలు చేయనున్నారు. ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు మార్చి 21నుంచి ఏప్రిల్ 4వరకు జరగనున్నాయి. ఈ ఏడాది 9.11 లక్షలమంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,750 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. వీటిలో వెయ్యికిపైగా పరీక్షా కేంద్రాలు తాలూకాస్థాయి, కీలక ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ కేంద్రాల్లో మాస్‌కాపీయింగ్ కట్టడికి కఠినచర్యలు తీసుకోనున్నారు. గత ఏడాది ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో వెబ్‌క్యాస్టింగ్ నిర్వహించారు. జిల్లా, తాలూకా స్థాయిలో కంట్రోల్‌రూంను ఏర్పాటు చేశారు. పరీక్షల వేళ సాంకేతిక అనుభవం కల్గిన అధికారులు కంట్రోల్ రూంలనుంచి పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల ప్రవర్తనపై నిఘా పెట్టనున్నారు. కంట్రోల్ రూం నుంచే ఇన్విజిలేటర్‌లను అప్రమత్తం చేసి కాపీయింగ్‌కు పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటారు. ఉత్తర కర్ణాటక ప్రాంతంలో మాస్ కాపీయింగ్‌ను తప్పించాలనే ఉద్దేశంతోనే పరీక్షామండలి గత ఏడాది తొలిసారిగా వెబ్‌క్యాస్టింగ్ పద్ధతిని అమలు చేసింది. తద్వారా 73.70శాతం ఫలితాలు సాధ్యం అయ్యాయి. 8.25లక్షలమంది విద్యార్థులు పరీక్షలు రాయగా 6.08 లక్షలమంది విద్యార్థులు పాస్ అయ్యారు.



ఎగ్జామినేషన్ బోర్డు కార్యాలయం

ఈ ఏడాది ఫలితాలపై ఉత్కంఠ

మాస్ కాపీయింగ్‌ను నియంత్రించేందుకు విద్యాశాఖ కీలకమైన నిర్ణయాలు తీసుకోవడం, మరోవైపు గడిచిన ఐదేళ్లుగా 10శాతం గ్రేస్ మార్కులు కొనసాగడం తెలిసిందే. కొవిడ్ కాలంలో పరీక్షలు నామమాత్రంగా అమలు చేశారు. ఆ తర్వాత వరుసగా 10శాతం గ్రేస్‌మార్కులతో ఉత్తీర్ణతకు వెసలుబాటు కల్పించారు. 2024లో మాస్ కాపీయింగ్‌పై విద్యాశాఖ కఠినంగా వ్యవహరించడంతో 2023తో పోలిస్తే ఉత్తీర్ణత 10శాతం తగ్గింది. రానున్న పరీక్షల్లో గ్రేస్ మార్కులు లేకపోవడం, మాస్ కాపీయింగ్‌కు అడ్డుకట్ట వేసేలా వెబ్‌క్యాస్టింగ్, కంట్రోల్‌రూం వంటి విధానాలు అమలు చేస్తుండడంతో ఫలితాలు ఎలా ఉంటాయనేది సర్వత్రా ఉత్కంఠగా మారింది. మరోవైపు ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో జీరో పర్సంటేజ్ పాఠశాలల సంఖ్యను తగ్గించాలని విద్యాశాఖ భావిస్తోంది. అందుకోసం స్పెషల్‌క్లాసులను నిర్వహిస్తోంది.

వెబ్‌క్యాస్టింగ్‌కు ఇతర శాఖల అధికారులు



పరీక్షల వేళ విద్యాశాఖకు సంబంధించి ఉపాధ్యాయులు, అధికారులకు ప్రత్యేకమైన బాధ్యతలు ఉంటాయి. పైగా సాంకేతిక పరిజ్ఞానం, అనుభవం కల్గిన వారు విద్యాశాఖలో తక్కువ మంది ఉంటారు. దీంతో వెబ్‌క్యాస్టింగ్ పర్యవేక్షణకు ఇతరశాఖలలో సాంకేతిక అనుభవం కల్గినవారిని గుర్తించారు. పరీక్షామండలి ముఖ్యులు జిల్లాస్థాయిలో వివిధశాఖల అధికారులను పదోతరగతి పరీక్షలకు కేటాయించాలని జిల్లా అధికారిని కోరారు. ఇప్పటికే దాదాపు అధికారుల ఎంపిక ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది.

1 నుంచి ద్వితీయ పీయూ ..

మరో వారం రోజుల్లో ద్వితీయ పీయూ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం పీయూ బోర్డు భారీ ఏర్పాట్లు చేస్తోంది. మార్చి 1నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఈఏడాది 7,13,862 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొంటున్నారు. వీరిలో 6,61,474 మంది కొత్త విద్యార్థులు కాగా 34,074 మంది సప్లిమెంటరీ, 18,317మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారు. వీరిలో 3,35,468 మంది బాలురు కాగా 3,78,389 మంది బాలికలు ఉన్నారు. ఐదుమంది థర్డ్‌జెండర్ విద్యార్థులు ఉన్నారు. 2,91,959మంది సైన్స్, 2,29,308మంది కామర్స్, 1,92,595 మంది ఆర్ట్స్ విద్యార్థులు ఉన్నారు. 5050 కళాశాలల విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా 1,171 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక స్క్వాడ్‌లతోపాటు 365 ప్రశ్నాపత్రాల పంపిణీ రూట్‌లను ఖరారు చేశారు.

21నుంచి ఎస్ఎస్ఎల్‌సీ..

మార్చి 21నుంచి ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 4వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఎస్ఎస్ఎల్‌సీలో 8,96,447మంది విద్యార్థులు పరీక్షలకు నమోదు చేసుకున్నారు. 2021లో 8.76 లక్షల మంది పరీక్షలు రాయగా ఈ ఏడాది అంతకు మించి నమోదు చేసుకోవడం రికార్డు అయ్యింది. సప్లిమెంటరీ విద్యార్థులు 38,091 మంది కాగా ప్రైవేట్ అభ్యర్థులు 15,539 మంది ఉన్నారు. వీరిలో 4,61,563 మంది బాలురుకాగా 4,34,884 మంది బాలికలు ఉన్నారు. 15,881 హైస్కూళ్ల విద్యార్థులు పరీక్షల్లో పాల్గొంటున్నారు. 2818 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 240 మౌల్యమాపన కేంద్రాలలో 65వేలమంది వాల్యుయేషన్ కోసం నియమించారు. అయితే మారిన సాంకేతిక పరిజ్ఞానంతో మాస్ కాపీయింగ్‌కు అధికారులు చెక్ పెట్టనున్నారు.

కాంగ్రెస్ భిక్షతోనే ఎమ్మెల్యేగా విజయేంద్ర : డీకే

బెంగళూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ భిక్షతోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ఎమ్మెల్యే అయ్యారని డీసీఎం డీకే శివకుమార్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. నగరంలో శుక్రవారం ఓ కార్యక్రమంలో డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడిన వేళ ఇప్పుడు పదవి వచ్చిందని విజయేంద్ర అన్నా అంటూ పిలుస్తారని, అతడు ఎమ్మెల్యే కావడం కాంగ్రెస్ భిక్ష అన్నారు. అతడిపై నాగరాజ్ వంటి బలమైన అభ్యర్థి రంగంలో ఉంటే విజయేంద్ర శాసనసభకు వచ్చేవారు కాదని ఎద్దేవా చేశారు. బీజేపీ రెబెల్‌నేత బసనగౌడ పాటిల్‌యత్నాళ్ తరచూ విజయేంద్ర ఒప్పందపు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం బీజేపీ స్తబ్ధుగా కావడానికి కీలకనేతలు కాంగ్రెస్ రాష్ట్ర పెద్దలతో అడ్జస్ట్‌మెంట్‌గా వ్యవహరిస్తుండడమే కారణమని వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే తరుణంలోనే డీసీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యలు మరింత బలాన్నిచ్చినట్లయింది.

చాముండి కొండలపై కార్చిచ్చు

- బూడిదైన భారీ వృక్షాలు
- ఫైరింజన్లతో అదుపులోకి మంటలు



కొండల్లో చెలరేగుతున్న మంటలు

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మైసూరు నగరానికి అనుబంధంగా ఉండే చాముండికొండలపై శుక్రవారం మధ్యాహ్నం కార్చిచ్చు రగిలింది. ఆకతాయిలు సిగరెట్ కాల్చి పడేయడం లేదా నిప్పు పెట్టడంతోనే మంటలు చెలరేగాయని అటవీశాఖ అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. చాముండేశ్వరి కొండకు వెళ్లే రోడ్డు మార్గంలోనే మంటలు ప్రబలాయి. ఉత్తనహళ్ళి భాగంలో తొలుత మంటలు కనిపించడంతో స్థానికులు చాముండేశ్వరి ఆలయ అధికారులతోపాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అప్రమత్తమైన అధికారులు వెంటనే అగ్నిమాపకశాఖకు సమాచారం చేరవేశారు. తొలుత ఓ ఫైరింజన్ ద్వారా మంటలు ఆర్పే ప్రయత్నాలు చేశారు. అదుపులోకి రాకపోవడం, మధ్యాహ్నం ఎండతోపాటు గాలి వీచడంతో వేగంగా మంటలు ప్రబలాయి. దీంతో మరో రెండు ఫైరింజన్‌లను రప్పించారు. మూడు ఫైరింజన్‌లు సుమారు 6 గంటలపాటు ప్రయత్నించి మంటలను అదుపులోకి తెచ్చాయి. అగ్నిమాపకశాఖ మైసూరు విభాగం రీజనల్ అధికారి చందన్ తెలిపిన మేరకు అగ్ని వ్యాపించిందనే సమాచారం తెలియగానే మూడు ఫైరింజన్‌లు, 25మంది సిబ్బంది కార్యాచరణలో పాల్గొని మంటలను నియంత్రించామన్నారు. గాలులు ఎక్కువగా ఉండడంతో ఎక్కువ సమయం పట్టిందన్నారు.



కాలిపోతున్న వృక్షాలు

భార్యను కడతేర్చి.. భర్త ఆత్మహత్య

- బళ్లారిలో రాజస్థాన్ వ్యాపారి ఘాతుకం
- అనాథలైన ముగ్గురు పిల్లలు



శంకర్ రావు (ఫైల్)

బళ్లారి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ వస్త్ర వ్యాపారి ఆత్మహత్య కలకలం రేపింది. బళ్లారి నగరంలోని గ్లాస్ బజార్‌లో నివాసం ఉండే శంకర్ రావు (40) తన భార్య శాంతిదేవి(34)ని హత్య చేసి తానూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. బ్రూస్‌పేట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు శంకర్‌రావు 15 ఏళ్ల క్రితం రాజస్థాన్ నుంచి బళ్లారికి వచ్చి వస్త్ర వ్యాపారం చేస్తూ జీవించేవారు. వీరికి ముగ్గురు పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడు. ఈ ముగ్గురూ శుక్రవారం ఉదయమే స్కూల్‌కు వెళ్లారు. శంకర్‌రావు భార్య శాంతిని బాటిల్‌తో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలతో ఆమె కన్నుమూసింది. తర్వాత శంకర్ రావు ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందారు. బడి నుంచి తిరిగి వచ్చిన పిల్లలు ఇంట్లో వచ్చి కిటికీలోంచి చూడగా తలుపువేసుకుని ఎవ్వరూ పలకలేదు. పిల్లలు కిటికీలోంచి తొంగి చూడగా ఫ్యాన్‌కు తండ్రి మృతదేహం వేలాడుతూ కలిపించింది. పిల్లలు గట్టిగా ఏడుస్తుండడంతో చుట్టుపక్కలవారు వచ్చి పరిశీలించారు. అప్పటికే ఇద్దరూ చనిపోయినట్లు స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి ఇంటి తలుపులు పగలకొట్టి ఇంట్లోకి వెళ్లారు. ముందుగా భార్యను హత్య చేసి తరువాత తాను ఆత్మహత్యకు పాల్పడినట్లు వారు గుర్తించారు. శంకర్‌రావు ఘాతుకానికి ఎందుకు పాల్పడినారు అన్నది చర్చనీయాంశంగా మారింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.



మృతదేహాలను తరలిస్తున్న పోలీసులు

ఎందుకింత దూకుడు..!

- మృత్యుకూపాలుగా జలపాతాలు ● సాహసాలతో ప్రాణాలు పోగొట్టుకుంటున్న పర్యాటకులు
- సెల్ఫీలు, రీల్స్ పిచ్చిలో యువత ● ప్రమాద హెచ్చరికలనూ లెక్కచేయరు..!

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదికి ఆనుకుని ఉన్న ఆనెగొంది, సణాపుర, చుట్టుప్రక్కల పర్యాటక కేంద్రాలు మృత్యు కూపాలుగా మారుతున్నాయి. సతాపురం గ్రామానికి ఆనుకుని ప్రవహిస్తున్న తుంగభద్ర నదివాటర్స్ అపాయకరమైన ప్రాంతాల్లో.. లోతు, పాతులు తెలియకుండా పర్యాటకులు చేస్తున్న పిచ్చి సాహసాలతో తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్న ఘటనలు... సంఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. ముఖ్యంగా సణాపుర గ్రామం వాటర్ ఫాల్స్, చెరువుల సందర్శించడానికి వారాంత్యంలో వందల సంఖ్యలో హాజరయ్యే పర్యాటకులు, మోజు, మస్తి, సామాజిక మాధ్యమాల్లో ప్రసారం అవుతున్న దృశ్యాలను వొంటికి అంటించుకుని జలపాతాల వద్ద రీల్స్ చేయడం ప్రమాదమని తెలిపినా, పిచ్చి చేష్టలతో సెల్ఫీలు, రీల్స్ తీయడం, నది లోతు తెలియకుండా దూకడం చేష్టలు ప్రాణాల మీదకు తెచ్చిపెడుతోంది. వీటి నియంత్రణకు స్థానిక రీసార్ట్ నిర్వాహకులు గాని, స్థానిక పాలనామండలి గాని అడ్డుకట్ట వేయలేక పోతున్నారన్నది స్థానికుల ఆరోపణ. తుంగభద్ర నది నీరు నరంతరంగా పారుతూ... కొండ, బండరాళ్ళ ప్రకృతి చెక్కిన కళాకృతులుగా మారాయి. ఈ సౌందర్యాన్ని కళ్ళారా చూసేందుకు వీలుగా రాష్ట్ర, పొరుగు రాష్ట్రాలతో పాటు విదేశాలకు చెందిన పర్యటకులు విచ్చేస్తుంటారు. అందులో యువతే ఎక్కువ. అపాయకరమైన స్థలాల్లో ఈతను నిషేదించే హెచ్చరిక బోర్డులు పాలనా మండలి ఏర్పాటు చేయలేక పోవడంతో నదిలో ఈత కొట్టడం ఎక్కడ సురక్షితం... ఎక్కడ ప్రమాదమని పర్యాటకులు తెలియక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇందుకు ఉదాహరణ మూడు రోజుల క్రితం హైదరాబాద్‌కు చెందిన అనన్యరావ్ అనే డాక్టర్ మృతి ఘటనా ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇలాంటి ఘటనలు గతంలో చాలా జరిగాయి.

పదునైన బండరాళ్లతోనే ప్రమాదాలు...

సణాపుర వాటర్ ఫాల్స్ పదునైన గుండ్లు, బండరాళ్ళతో కూడిన ప్రాతం. ఈ ప్రాంతంలో చాలా వరకు సొరంగాలు ఉన్నట్లు, నీటిలోపల కూడా పదునైన రాళ్ళు ఉన్నాయి. వీటిపైనా తుంగభద్ర నీరు ప్రవహిస్తుంటుంది. నదిలో నీటి ప్రమాణం ఎక్కువ ఉన్న సమయంలో ఈ పదునైన బండరాళ్ళు కనిపించవు. ఇవి తెలియని పర్యాటకులు నదిలో ఈతకొట్టడం సాహసమని నిరూపించేందుకు నీటిలో దూకడం... ప్రాణాలు పోగొట్టుకోవడం పరిపాటిగా మారిందని చెప్పవచ్చు. సణాపుర భాగంలో సూర్యోదయం, సూర్యాస్తమయాల సమయంలో ఫొటోలు, సెల్ఫీలు తీసుకునేందుకు రాళ్ళ అంచుల నిలవడం, పర్యాకులను ఆకర్షించేందుకు స్థానికులు 'క్లిఫ్ జంపింగ్' పేరుతో దూకి డబ్బులు సంపాదించడం ఇక్కడ కొంతమంది ఉపాధిగా చేసుకున్నారు. ఇలాంటి దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసుకోవడం ద్వారా వీటిని యువత ఆకర్షితులవుతున్నారు. వీటన్నిటికీ జిల్లా పాలక మండలి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని సణాపురం గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రెండు రోజుల క్రితమే వాటర్ ఫాల్స్ వద్ద దుర్ఘటన జరిగినా... అక్కడికి చేరుకుంటున్న యువత పిచ్చి సాహసాలు కొనసాగిస్తుండం ఆందోళన కలిగించే విషయం. స్థానికంగా రిసార్ట్స్ నిర్వహకులు, స్థానికులు పర్యాటకులకు వాటర్ ఫాల్స్‌లో ఈతకొట్టడం ఉత్తమ స్థలాలని తప్పుడు సమాచారం ఇస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ప్రమాదకరమైన ప్రాంతాలు విషయం తెలియకుండా ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. జంపింగ్ వ్యవస్థకు అడ్డుకట్ట వేయాలని, వాటర్ ఫాల్స్ కలిగిన ప్రాంతాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని సణాపుర గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తూ భవిషత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కొండపైనుంచి నదిలోకి దూకుతున్న యవకుడు (ఫైల్)



సణాపురం వద్ద తరచూ ప్రమాదం జరిగే కొండ ప్రాంతం



మార్కెట్లో వేరుశనగ కుప్పలు

ఏపీఎంసీలో ఆగిన వేరుశనగ అమ్మకాలు 8



చిన్నస్వామి స్టేడియంలో క్రికెట్ అభిమానుల సందడి 7